క్లుప్తంగా

వలసలను నివారించాలి


మాట్లాడుతున్న ఈసీ ప్రదీప్‌కుమార్

తుగ్గలి : అడిగిన ప్రతి కూలీకి పనులు చూపి వలసలు వెళ్లకుండా చూడాలని ఏపీడీ పక్కీరప్ప ఆదేశించారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో మంగళవారం ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..వ్యవసాయ పనులు పూర్తయిన గ్రామాల్లో పని అడిగితే కూలీలకు తప్పనిసరిగా ఉపాధి పనులు చూపాలన్నారు. పండ్లతోటల రైతులకు బిల్లులు చెల్లింపులో నిర్లక్ష్యం చేయవద్దని చెప్పారు. ఉపాధి హామీ పనులు, వేతనం, చెల్లింపులపై కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్లాంటేషన్ సూపర్వైజర్ రత్నం, హార్టికల్చర్ ఏపీఓ హేమసుందర్, ఈసీ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 28 మందికి ఉద్యోగాలు


నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్, స్కిల్ దెవలప్‌మెంట్ అధికారులు

పత్తికొండ(తుగ్గలి) : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. వివిధ కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ఎంపిక ప్రక్రియకు 78 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. వీరిలో 28 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికై న వారికి నియామక పత్రాలను కళాశాల ప్రిన్సిపాల్ మాధురి, స్కిల్ డెవలప్‌మెంట్ నాన్ టెక్నికల్ జిల్లా ఆఫీసర్ శ్రీనివాసులు అందజేశారు. కార్యక్రమంలో సిల్‌డెవలప్‌మెంట్ పత్తికొండ కోఆర్డినేటర్ అల్తాఫ్, ట్రైనర్లు ప్రవీణ్‌కుమార్, లక్ష్మీనారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించుకోవాలి


మొక్కలను అందజేస్తున్న సర్పంచ్ బండారు సుహాసిని

మద్దికెర : విద్యార్థులు నాటిన మొక్కలను ప్రతిరోజు గమనిస్తూ వాటిని సంరక్షించుకోవాలని సర్పంచ్ బండారు సుహాసిని తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు రోడ్డు దాటి నేరుగా పాఠశాల్లోకి వెళ్లేందుకు పంచాయతీ నిధులు రూ.6 లక్షలతో చేపట్టిన రెయిలింగ్ నిర్మాణం ప్రారంభించి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉండటంతో పరిసరాల్లో ఆటోలు నిలపకుండా, బంకులు తొలగించామన్నారు. ఉపసర్పంచ్ ప్రమీలమ్మ, ప్రధానోపాధ్యాయుడు దేవేంద్రప్ప , ఏఈ మయాంక్, ఆంజనేయులు, పూర్వ విద్యార్థి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరంపై దాడులు


నెరణికి తండా కొండల్లో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

హొళగుంద: మండలంలోని నెరణికి తండా కొండల్లో మంగళవారం హొళగుంద ఎస్‌ఐ బాల నరసింహులు ఆధ్వర్యంలో సిబ్బంది నాటు సారా స్థావరాలపై దాడులు చేశారు. కొండల్లో ఉన్న స్థావరాలను గుర్తించి డ్రమ్ములు, బిందెల్లో నిల్వ ఉంచిన 800 లీటర్ల బెల్లం ఊటను, బిందెలను ధ్వంసం చేశారు. కొండల్లో పెద్ద ఎత్తున సారా తయారు చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం నుంచి కొండల్లో గాలించి స్థావరాలను ధ్వంసం చేశారు. ట్రైనీ ఎస్‌ఐ మహమ్మద్, కానిస్టేబుళ్లు పెద్దన్న, జనార్ధన్, గోపాల్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆలూరు విద్యుత్ ఏడీఈగా సంతోష్‌కుమార్



ఆలూరు: విద్యుత్ శాఖ సబ్‌డివిజన్ ఇంజినీర్‌గా సంతోష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం జిల్లా నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న విద్యుత్ ఏడీఈ శ్రీకాంత్ వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీపై వెళ్లారు. నూతన ఏడీఈకి ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాల విద్యుత్ ఏఈలు, ఎల్ఐ, జేఎల్ఎంలు, పోల్‌టూ పోల్ వర్కర్లు , సీఐటీయూ నాయకులు, 1104 యూనియన్ నాయకులు, విద్యుత్ కాంట్రాక్టర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి ఆహ్వానం పలికారు.

విజృంభిస్తున్న విషజ్వరాలు

- రోజురోజుకు పెరుగుతున్న బాధితులు
- పల్లెల్లో లోపించిన పారిశుద్ధ్యం
- తీవ్రంగా దోమల బెడద
- ముందస్తు చర్యలతో డెంగీ నివారణ
- పరిసరాల శుభ్రత పాటించాలంటున్న వైద్యులు


ఎరుకలచెరువులోని ఓ కాలనీలో అపరిశుభ్రంగా ఉన్న దృశ్యం

కృష్ణగిరి: రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలు.. గ్రామాల్లో పరిశుభ్రతకు నోచుకోని పరిసరాలు.. కాలువల్లో కదలని మురుగునీరు.. దోమలకు నిలయంగా మారుతున్న ఆవాస ప్రాంతాలు.. దీంతో పల్లె జనం విషజ్వరాల బారిన పడుతున్నారు. రోజురోజుకు బాధితుల సంఖ్య పెరుగుతన్నా యంత్రాంగం పట్టించుకోకపోవడం దారుణం. పరిసరాల శుభ్రత పాటించాలని , దోమల నివారణ చర్యలు చేపట్టాలని వైద్యులు సూచిస్తున్నారు.

పెరుగుతున్న జ్వర పీడితులు

కురుస్తున్న వర్షాలతో పాటు నెల నుంచి విష జ్వరాలు ప్రబలి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యాతో పాటు నూతన వైరల్ ఫీవర్ విజృంభిస్తోంది.దీంతో జనం ఆసుపత్రులకు బారులుదీరుతున్నారు. విష జ్వరాలతో కృష్ణగిరి పీహెచ్‌సీకు రోజుకు ఆరు నుంచి ఏడు ఓపీలతో పాటు సాధారణ జ్వరాల ఓపీ 60–70 మంది వస్తున్నారని వైద్యాధికారి ప్రదీప్ తెలిపారు. వెల్దుర్తి సీహెచ్‌సీకి సాధారణ ఓపీ 200కి పైగా వస్తున్నారు. విషజ్వరాలకు సంబంధించి 20–30 వరకు ఓపీ ఉంటుండగా, నూతన వైరల్ జ్వరానికి సంబంధించి 8–9 మంది వస్తున్నారని ఆసుపత్రి సూరింటెండెంట్ బాలచంద్రారెడ్డి తెలిపారు. నూతన వైరల్ జ్వరానికి సంబంధించి డెంగీ, చికెన్ గున్యా పరీక్షలు చేయించినా నెగెటివ్ వస్తుందని, అయితే జ్వరంతో పాటు కీళ్ల నొప్పులు, వాపులతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. కాగా ఇందుకు ప్రత్యేక మందులేవీ లేవని, పది రోజులు గడిస్తే సాధారణంగానే తగ్గిపోతుందని, ఇష్టానుసారంగా మందులు వాడకుండా వైద్యులను సూచనల మేరకు వాడాలని చెబుతున్నారు.

నిర్లక్ష్యంతో ప్రమాదం..

వాతావరణంలో వస్తున్న మార్పుల సమయంలో పరిసరాల అపరిశుభ్రంతో వ్యాధులు సోకే అవకాశం ఉంది. ప్రధానంగా దోమల నివారణతోనే పలు వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని రక్షించకోవచ్చు. జ్వరం , దగ్గు, జలుబు సాధారంగా ఒకరి నుంచి మరొకరికి సోకే అవకాశం ఉంది. ప్రధానంగా దోమల ప్రభావంతోనే అంటువ్యాధులు వస్తున్న నేపథ్యంలో ముఖ్యంగా దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. దోమలతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు సోకుతాయి.

పల్లెలు కంపు కంపు..

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించకపోవడంతో పల్లెల్లో చెత్త చెదారం పేరుకుపోతోంది. మురుగు కాల్వలను శభ్రం చేయకపోవడంతో దోమలు పెరిగిపోతున్నాయి. దీంతో జ్వరాలు వ్యాపిస్తున్నాయి.

డెంగీ వ్యాప్తి ఇలా: ఏడిస్ ఈజిప్టై దోమ కారణంగా డెంగీ వ్యాధి సోకుతుంది. నల్లగా ఉండే ఈ దోమ ఒంటి మీద తెల్లని చారలుంటాయి. అందుకే దీన్ని టైగర్ దోమ అని కూడా అంటారు. శరీరంలో డెంగీ వైరస్ ప్రవేశించిన 7 రోజులు తరువాత దాన్ని మనుషులకు వ్యాపింపజేస్తుంది. ఇది కుట్టినప్పుడు నొప్పి ఉండదు. ఇది పగటిపూట మాత్రమే ఎక్కువగా కుడుతుంది. ఈ దోమ శుభ్రమైన నీటితో పాటు కలుషితమైన నీటిలో వృద్ధి చెందుతుంది.

లక్షణాలు..

దోమలు కుట్టిన 7–8 రోజుల తరువాత హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది. కళ్లు కదిలించలేని స్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పితోపాటు శరీరంపై పొక్కులు వస్తాయి. వాంతులు, వికారంగా ఉండటం, రక్తంతో కూడిన మలమూత్ర విసర్జన, కడుపు నొప్పి కూడా ఉంటుంది. రక్తపోటుతో పాటు రక్త కణాల సంఖ్య తగ్గిపోతుంది. కొన్నిసార్లు అవయవాలు వైకల్యం చెంది ప్రాణపాయం కూడా ఏర్పడే అవకాశాలు ఉంటాయి.

జ్వరాలన్నీ డెంగీ కాదు..



ఎలీసా రక్త పరీక్షల్లో నిర్ధారణ అయితేనే డెంగీ వ్యాధిగా గుర్తిస్తారు. దానికి మాత్రమే చికిత్స అవసరం . మిగతావన్నీ సాధారణ జ్వరాలే. రాత్రి పూట కుట్టే దోమలకంటే పగటి పూట దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. డెంగీ దోమలు ఎక్కువగా పగటి పూట మాత్రమే కుడతాయి. ప్రధానంగా పిల్లలకు మాత్రమే దీని ప్రభావం ఎక్కువగా ఉంటుంది. పిల్లలకు దోమలు కుట్టకుండా కాళ్లు చేతులు పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు తొడగాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. – వై. ప్రదీప్, వైద్యాధికారి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కృష్ణగిరి

సమాచారహక్కు చట్టంపై అవగాహన అవసరం

మద్దికెర : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఏఓ రవి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సమాచారహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు.

పత్తికొండ(తుగ్గలి) : సమాచారం హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన ఉండాలని వ్యవసాయశాఖ మండల అధికారి వెంకటరాముడు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కర్నూలు టెక్నికల్ ఏఓ శశిధర్‌రెడ్డి, ఏఈవోలు రియాజ్ బాషా, రుక్సానా పాల్గొన్నారు.

పరామర్శ

కృష్ణగిరి: కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో లివర్ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతున్న మండలంలోని జి. మల్లాపురం గ్రామానికి చెందిన వార్డు మెంబర్ సుజాత భర్త సుధాకర్‌ను మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మంగళవారం పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

వలస కూలీ మృతి


మృతి చెందిన మౌనిక (ఫైల్)

ఆస్పరి: ఐనకల్లు గ్రామానికి చెందిన మౌనిక (23) అనే వలస కూలీ సోమవారం తిరుపతిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలు సోమవారం భర్త గోవిందుతో కలిసి భవన నిర్మాణ పనులకు వెళ్లింది. అయితే కంకర కలుపుతున్న మిల్లర్‌లో మౌనిక చీర చిక్కుకుని అందులో పడి మృతి చెందింది. ఏటా గ్రామంలో పొలం పనులు పూర్తయిన తరువాత పనుల కోసం తిరుపతికి వెళ్లే వారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

- పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య

ఆలూరు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారైనా చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ బి.వెంకటరామయ్య స్పష్టం చేశారు. స్థానిక పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఓ కేసు విచారణ నిమిత్తం మంగళవారం ఆలూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఉన్న ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ, దోపిడీలు, చిన్నారులపై లైంగికంగా వేదింపులపై పోలీసులు విద్యార్థులకు సదస్సులు నిర్వహించిన అవగాహన కల్పించాలని సూచించామన్నారు. మట్కా, నాటుసారా తయారీదారులపై నిఘా ఉంచి వారు తమ కార్యకలాపాలను పూర్తిగా మానుకునేలా చేయాలని సీఐ, ఎస్‌ఐలను ఆదేశించారు.ఆలూరు సీఐ కె. శ్రీనివాస నాయక్, ఎస్‌ఐ సీవి నరసింహులు, హెడ్‌కానిస్టేబుళ్లు జానీవాకర్,రంగయ్య ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కూల్చేస్తాం

మద్దికెర : గ్రామంలో పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించి నిర్మించినా, నిబంధనలు అతిక్రమిస్తే కూల్చివేస్తామని ఈఓ శివకుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక పంచాయతీలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రధాన బజారులో నాబార్డు నిధులతో కూరగాయల మార్కెట్, పంచాయతీ కాంప్లెక్స్ నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు. మరో రెండు చోట్ల నిర్మాణాలు చేపట్టి వ్యాపారులకు అందజేస్తామన్నారు. కొంతమంది ఇళ్ల స్థలాలు పొంది ఇష్టానుసారంగా నిర్మాణాలు చేశారని ఆరోపణలున్నాయన్నారు. తమ జీవనోపాధికి గదులు కేటాయించాలని నాయీ బ్రాహ్మణులు విన్నవించారని, వారికి న్యాయం చేస్తామని తెలిపారు. సభ్యులు లక్ష్మీనారాయణ, బాలచంద్ర, జంబురాయుడు, ఈఓలు కరుణకుమారి, రేణుక పాల్గొన్నారు.


హొళగుందలోని అయోధ్యనగర్ నుంచి తెలంగాణకు వలస వెళ్తున్న కూలీలు

కూలీల వలసబాట

హొళగుంద: స్థానిక అయోధ్యనగర్ కాలనీ నుంచి మంగళవారం సాయంత్రం లారీ, మూడు టెంపో వాహనాల్లో దాదాపు 200 కుటుంబాలు తెలంగాణకు వలస బాట పట్టారు. గ్రామంలో కల్పించిన ఉపాధి పనులు గిట్టుబాటు కాకపోవడం, ఇతర ప్రాంతాల కూలీలు ఇక్కడికి వస్తుండడంతో పాటు పత్తి కోతలు, ఇతర పనులు తగ్గుతుండటంతో తమకు ఉపాధి కరువైందన్నారు. దీంతో తెలంగాణ, గుంటూరు తదితర ప్రాంతాలకు ఉపాధి కోసం తట్టాబుట్టా సర్దుకుని వలస వెళ్లారు. అక్కడ భవన నిర్మాణాలు, కాఫీ తోటలు, వ్యవసాయ పనులు ఉంటాయని చెబుతున్నారు. ఈ సారి అతివృష్టి వల్ల సాగు చేసిన వేరుశనగ, పత్తి పంటలు దెబ్బతిని రైతులు నష్ట పోయారు. వచ్చే నెలలో వరి కోతలు ఉన్నప్పటికీ.. రైతులు మిషన్‌లతో నూర్పిడి చేయిస్తుండటంతో పనులు అంతగా ఉండవని వలస వెళ్తున్నట్లు కూలీలు తెలిపారు. ఉపాధి పనులు కల్పించినా కూలి గిట్టుబాటు కాకపోవడం, డబ్బులు సకాలంలో అందక వలస వెళ్తున్నట్లు తెలుస్తోంది.

చిన్నారులకు దాతల సాయం


చిన్నారులకు సాయం అందిస్తున్న దాతలు

తుగ్గలి : తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులను ఆదుకునేందుకు పలువురు ముందుకొస్తున్నారు. మారెళ్ల గ్రామానికి చెందిన అంజినయ్య మూడేళ్ల క్రితం మృతి చెందగా..రెండు రోజుల క్రితం ఆయన భార్య లక్ష్మి గుండెపోటుతో మృతి చెందింది. తల్లిదండ్రుల మృతితో దిక్కు కోల్పోయిన చిన్నారులకు సాయం అందించేందుకు దాతలు స్పందిస్తున్నారు. దేవనకొండ మండలం నల్లచెల్లిమల గ్రామ వాల్మీకులు రూ.20వేలు, కిష్టన్న, నరసింహులు, చెన్నకేశవులు సుంకన్న, రాంపల్లి సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, రాంపల్లి రవి (బ్యాంకు మేనేజర్), రామచంద్రుడు రూ.5వేల చొప్పున, మద్దికెర లక్ష్మన్న రూ.1500, పత్తికొండ శంకరరెడ్డి రూ.2,500 గంగాధర్ రూ.3వేలు నరసింహులు, నాగేశ్వరరావు, చంద్ర రూ.2,500 నగదు బుధవారం చిన్నారులుకు అందజేశారు.

నేడు దివ్యాంగుల ఉపకరణాలపై సర్వే

ఆలూరు: స్థానిక సచివాలయం–2 ఆవరణలో బుధవారం దివ్యాంగల ఉపకరణాలపై సర్వే నిర్వహిస్తారని ఆలూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.రమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, జిల్లా కేంద్రం నుంచి డాక్టర్లు, దివ్యాంగుల వైకల్య శాతాన్ని పరిశీలించి కార్డులు అందజేస్తారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆలూరు: మండలంలోని కరిడిగుడ్డం గ్రామ విద్యుత్ ఫీడర్‌కు బుధవారం ఉదయం 10 నుంచి 1.50 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ గుర్రప్ప మంగళవారం తెలిపారు. అలాగే విరుపాపురం గ్రామ ఆర్‌డబ్ల్యూఎస్, అరికెర గ్రామ విద్యుత్ ఫీడర్లలో తాత్కాలికంగా మరమ్మతుల పనులు ఉన్నాయని సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. వినియోగదారులు గమనించాలని కోరారు.

పాము కాటుతో రైతుకు అస్వస్థత

పత్తికొండ(తుగ్గలి) : పాము కాటుతో రైతు అస్వస్థతకు గురై ఘటన మంగళవారం మండలంలోని జూటూరులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు నరసప్ప పొలంలో మిరప పంటకు నీటి తడులు అందించేందుకు వెళ్లారు. బోరు మోటారు ఆన్‌చేసినా నీళ్లు రాకపోవడంతో ఫుట్బాల్‌ను పరిశీలిస్తుండగా అందులో ఉన్న పాము రైతు చేతిపై కాటు వేసింది. పాముకాటు గమనించిన రైతు హుటాహుటిన చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు బాధితుడికి చికిత్స చేశారు.

కోలుకోలేక యువకుడి మృతి


విష్ణు (ఫైల్)

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన చాకలి విష్ణు (19) కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సెప్టెంబర్ 28న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దేవనకొండ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కర్నూలు జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స నుంచి కోలుకోలేక మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి అన్న విక్రమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపారు.

25న జాబ్‌మేళా

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్‌ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మహబూబ్‌బాషా, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి ఆనంద్‌రాజ్ కుమార్ మంగళవారం తెలిపారు. క్రెడిట్ ఆక్సిస్ గ్రామిణ్ లిమిటెడ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఇంటర్, డిగ్రీ అర్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వివరాల కోసం సెల్ నంబర్ 8885904099కు సంప్రదించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు


హొన్నూరు గ్రామంలో రైతుల నుంచి అర్జీలు తీసుకుంటున్న అధికారులు


ఎస్. బోయినపల్లె గ్రామసభలో పాల్గొన్న కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్

వెల్దుర్తి(కృష్ణగిరి): భూ సమస్యల పరిష్కారం కోసమే భూ రీసర్వే చేపట్టినట్లు కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ తెలిపారు. వెల్దుర్తి మండలంలోని ఎస్.బోయినపల్లె గ్రామంలో మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ ఆధ్వర్యంలో జరిగిన రీ సర్వే గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు. అనంతరం వెల్దుర్తిలోని సివిల్ సప్లయిస్ గోడౌన్‌ను తనిఖీ చేశారు. రేషన్ షాపులకు సరుకులు పంపే ముందు ప్రతి బస్తాను డీలర్ సమక్షంలో తూకం వేయాలని ఆర్డీఓ ఆదేశించారు.

కృష్ణగిరి: ఆగవేళి గ్రామంలో మంగళవారం జరిగిన రీసర్వే గ్రామసభలో తహసీల్దార్ చంద్రశేఖర్ రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ విస్తీరణంలో వ్యత్యాసం, పేర్లలో తప్పులు, ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడం, హద్దుల నిర్ణయంలో తేడాలు తదితర అభ్యంతరాలను రైతుల నుంచి స్వీకరించారు. మొత్తం 170 అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అభ్యంతరాలను నవంబర్ 15వ తేదీలోపు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వో రాజశేఖర్ రెడ్డి, సచివాలయ సర్వేయర్లు మాధవకృష్ణ, ప్రేమ్‌కుమార్, అఖిల, చంద్రశేఖర్, హరికృష్ణ పాల్గొన్నారు.

పత్తికొండ(తుగ్గలి) : రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని పత్తికొండ మండల రీసర్వే డీటీ బాలరాజునాయక్, ఆర్ఐ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పుచ్చకాయలమాడలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై రైతులు 37 అర్జీలు ఇచ్చారు. సర్వేయర్ గాదిలింగప్ప, వీఆర్వో మల్లికార్జున, విలేజ్ సర్వేయర్ రామకృష్ణ పాల్గొన్నారు.

తుగ్గలిలో..

ఎద్దులదొడ్డిలో రెవెన్యూ అధికారులు రీ సర్వే గ్రామసభ నిర్వహించి రైతులనుంచి 118 అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ సుధాకర్, వీఆర్వోలు తిమ్మయ్య, కాశీరంగస్వామి, గోపాలకృష్ణ, విలేజ్ సర్వేయర్ విశ్వనాథ్ పాల్గొన్నారు.

హాలహర్వి: రీ–సర్వేలో నెలకొన్న భూ సమస్యలను గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని రీ సర్వే డీటీ బ్రహ్మయ్య తెలిపారు. మంగళవారం కొక్కరచేడు గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్ఐ మహేష్, మండల సర్వేయర్ భార్గవి, వీఆర్వో పెద్దన్న, సర్పంచ్ మన్మథరెడ్డి, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

హొళగుంద: గతంలో జరిగిన రీ సర్వేలో అభ్యంతరాలపై, భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని హొన్నూరు గ్రామంలో గ్రామసభ జరిగింది. ఆన్‌లైన్ అడంగళ్లలో భూముల విస్తీర్ణం హెచ్చుతగ్గులు ఆన్‌లైన్ అడంగల్‌లో చేర్పులు మార్పులపై అర్జీలు సమర్పించారు. డీటీ నిజాముద్దీన్, సర్వేయర్ డీటీ ముకుందరావు,వీఆర్‌ఓలు నాగరాజు, ప్రహ్లాద, దామోదర పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

- 12 మంది అరెస్ట్
- రూ.1,68,750 నగదు స్వాధీనం
- 4 కార్లు, ద్విచక్రవాహనాలు సీజ్


నిందితులను చూపుతున్న డీఎస్పీ బి.వెంకటరామయ్య

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామ సమీప పంట పొలాల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు ఆలూరు ఎస్‌ఐ సీవి.నరసింహులు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారని పత్తికొండ డీఎస్పీ బి.వెంకటరామయ్య తెలిపారు. మంగళవారం స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. దాడుల్లో నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేత అనుచరుడు శీను, ప్యాపిలి మండలం బోయపల్లి గ్రామానికి చెందిన బెస్తా లక్ష్మీనారాయణ, హాలహర్వి మండలం పచ్చార్లపల్లి గ్రామానికి చెందిన గుమ్మనూరు బాబురావు, చిప్పగిరి మండలం నేమకల్లు గ్రామానికి చెందిన టి.చంద్రశేఖర్‌తో పాటు మరో 8 మందిని అరెస్ట్ చేసి రూ.1,68,750 నగదు, నాలుగు కార్లు, ద్విచక్ర వాహనాలు, ఎనిమిది సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు వివరించారు.

పంటల పరిశీలన


పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

దేవనకొండ: మండలంలోని నేలతలమరి, నల్లచెలిమల గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా పత్తి , మిరప పంటలను ఏడీఏ గిరీష్, మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు పరిశీలించారు. ఏరువాక కేంద్రం నుంచి ఏడీఏ గిరీష్ మాట్లాడుతూ.. మిరప పంటలో ఎకరాకు పది జిగురు అట్టలు ఏర్పాటు చేసుకుంటే రసం పీల్చే పురుగులు అతుక్కొని చనిపోతాయన్నారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రవి, ఎంపీటీసీ విజయభాస్కర్ గౌడ్, మాజీ సర్పంచ్ నాగరాజు, ఏఈఓ వి.రంగన్న, వీఏఏ సురేంద్ర, ఎంపీఈఓ వినయ్ పాల్గొన్నారు.


మరువ పారుతున్న జొన్నగిరి చెరువు


అలుగు పారుతున్న పగిడిరాయి చెరువు

జల సవ్వడి

తుగ్గలి : విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు, చెరువులు జలకళ సంతరించుకున్నాయి. మండలంలోని జొన్నగిరి, పగిడిరాయి చెరువులు నిండి గత కొద్ది రోజులుగా మరువ పారుతున్నాయి. ముక్కెల్ల, తుగ్గలి చెరువులకు 90 శాతం నీరు చేరగా ముక్కెల్లలో మాత్రమే ఆయకట్టులో రైతులు వరి పంట సాగు చేశారు. మిగిలిన చెరువులకు అంతంత మాత్రంగా వర్షపు నీరు చేరింది.నాలుగైదేళ్లకోసారి జొన్నగిరి చెరువు నిండుతుండటంతో ఆ చెరువు కింద ఆయకట్టు సాగులోలేక భూముల్లో కంపచెట్లు పెరిగిపోయి బీడువారాయి. ఏటా వేసవిలో తాగునీటికి సైతం అవస్థలు పడ్డారు. ఇప్పుడు చెరువు నిండడంతో తాగునీటికి ఢోకా ఉండదని గ్రామస్తులు చెబుతున్నారు.

మహిళా పోలీసుకు సన్మానం


మహిళా పోలీసును సన్మానిస్తున్న దృశ్యం

హొళగుంద: ఎల్లార్తి గ్రామ సచివాలయ పరిధిలో మహిళా పోలీసుగా పనిచేస్తూ నంద్యాల జిల్లా అంబాపురం గ్రామ సచివాలయానికి బదిలీ అయిన ధనలక్ష్మిని మంగళవారం సర్పంచ్ కురువ చాముండేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఎస్కే గిరి, హెచ్ఎం విజయమ్మ, సచివాలయ సిబ్బంది కుషానాయక్, శివ, శీను, ఎల్‌హెచ్‌పీ నీరజ ఆమెను సత్కరించారు.

అమరుల త్యాగాలతో శాంతి స్థాపన


మాట్లాడుతున్న అర్బన్ సీఐ జయన్న

పత్తికొండ(తుగ్గలి) : పోలీసుల అమరవీరుల త్యాగాలతోనే దేశంలో శాంతిభద్రతలు నెలకొన్నాయని ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, అర్బన్ సీఐ జయన్న పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని సమీకృత వసతి గృహంలో పోలీసుల అమర వీరుల దినోత్సవాన్ని నిర్వహించి పోలీస్ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 10వ తరగతి విద్యార్థులను దత్తత తీసుకుని వారికి ప్రత్యేక ట్యూషన్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.